# సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 17 । జనవరి । 2024




### పోచమ్మకు బోనం మొక్కులు

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో మొక్కులు చెల్లించుకునేందుకు ఎక్కువ సమయం ఎదురుచూడాల్సి వచ్చింది. నెత్తిన బోనాలతో భక్తులు దప్పుచప్పుళ్ల మధ్య విన్యాసాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు.

## న్యూస్‌రీల్

### 'బండి'పై ఎస్పీకి ఫిర్యాదు

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్

**సిరిసిల్లటౌన్:** కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ కుట్రపన్ని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి వేస్తుందన్న బండి సంజయ్ వ్యాఖ్యలపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను గందరగోళానికి గురిచేస్తాయన్నారు. బండిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు వెల్లడించారు. పీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ ఉన్నారు.

### బంద్ నిర్ణయం ఉపసంహరించుకోవాలి




మాట్లాడుతున్న పంతం రవి

**సిరిసిల్లటౌన్:** పాలిస్టర్ వస్త్రపరిశ్రమ బంద్ నిర్ణయాన్ని వస్త్రోత్పత్తిదారులు ఉపసంహరించుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి కోరారు. సిరిసిల్ల కార్మికభవనంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్ఎస్ఐ, మ్యాక్స్ సొసైటీల ప్రక్షాళన తర్వాతనే ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ సర్కారు వస్త్రపరిశ్రమకు బకాయి పెట్టిన రూ.260కోట్లతోనే సంక్షోభం నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తేరుకుని పాలిస్టర్, కాటన్ వస్త్రోత్పత్తి కార్మికులకు ఉపాధి అందించాలని కోరారు. నల్ల చంద్రమౌళి, కదారి రాములు, వేణు, గణేష్ పాల్గొన్నారు.

### అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల



**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** ఇల్లంతకుంట మండలం అనంతగిరి(అన్నపూర్ణ) రిజర్వాయర్ నుంచి మంగళవారం ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి నీటి విడుదల చేశారు. మాజీ సర్పంచ్ వెంకటాచారి, వార్డు సభ్యుడు ఎల్లంగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కడగండ్ల తిరుపతి పాల్గొన్నారు.

### తంగళ్లపల్లి ఎస్సైపై అవినీతి ఆరోపణలు?

**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సైపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇసుక ట్రాక్టర్ల యజమానుల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని ఎస్సై సూచనలతో ఒక వ్యక్తి రూ.39వేలు అందజేసినట్లు ఇద్దరు వ్యక్తులు మాట్లాడిన కాల్ రికార్డు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అవినీతి ఆరోపణలపై ఎస్పీ అఖిల్ మహాజన్ విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సైని 'సాక్షి' వివరణ కోరగా ఆరోపణలు అవాస్తవమన్నారు. కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

### ప్రతిష్టాత్మకంగా 'ఆరోగ్య మహిళ'

**సిరిసిల్లటౌన్:** రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్యమహిళ'ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు కోరారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీహెచ్‌సీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా పరీక్షలు చేశారు. ఒకరిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

### సిరిసిల్లలో ప్లాస్టిక్ వస్తువులు నిషేధం

**సిరిసిల్లటౌన్:** ప్లాస్టిక్ పదార్థాలతో పర్యావరణానికి కలుగుతున్న ముప్పు నుంచి రక్షించేందుకు సిరిసిల్ల పట్టణంలో 16 రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ మంగళవారం ప్రకటించారు. ఇయర్‌బడ్స్, బుడగలు(బెలూన్స్), క్యాండి, ఐస్‌క్రీం కోసం వాడే పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ప్లాస్టిక్ కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, ఆహ్వాన పత్రికలు, సిగరేట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, పాలిస్టరిన్(థర్మాకోల్) 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను నిషేధించినట్లు వివరించారు.

# బడికి రాం రాం!

- డెప్యూటేషన్‌తో పాఠశాలలకు టీచర్లు దూరం
- ఏళ్లు గడుస్తున్నా ముఖం చూపించని ఉపాధ్యాయులు
- రాజకీయ పలుకుబడి కారణమన్న అపవాదు
- పరపతి పెంచుకుని నచ్చిన చోట 'సర్దుబాటు'
- అందరినీ వెనక్కి పిలిపించాలంటున్న వైనం



ఉమ్మడి జిల్లా ప్రభుత్వ టీచర్లు, విద్యార్థుల వివరాలు

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థులు | టీచర్ల సంఖ్య |
|---|---|---|---|
| కరీంనగర్ | 651 | 48,745 | 3,206 |
| పెద్దపల్లి | 592 | 46,241 | 2,209 |
| సిరిసిల్ల | 534 | 55,955 | 2,134 |
| జగిత్యాల | 783 | 49,946 | 1,403 |

**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో పలువురు డెప్యుటేషన్ మీద వెళ్లి ఏళ్లు గడుస్తున్నా తిరిగి రావడం లేదు. కొందరైతే అసలు తాము ఏ శాఖకు చెందిన వారో మర్చిపోయేంతగా ఫారిన్ సర్వీసుల్లో తిష్ట వేశారంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫారిన్ సర్వీసుల్లో ఉన్న వారు ఐదేళ్ల తరువాత తిరిగి మాతృశాఖకు వచ్చేయాలి. కానీ, దాదాపు దశాబ్దకాలంగా కొందరు టీచర్లు పూర్తిగా బోధనకు దూరమయ్యారు. తాము టీచర్లమన్న సంగతి గుర్తులేనంతగా ఇతర శాఖల్లో పాతుకుపోయారు. ఈ వ్యవహారం కేవలం కరీంనగర్ జిల్లాకే పరిమితం కాలేదు. పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాలలోనూ ఇదే తంతు సాగుతోంది. ఇంతకాలం రాజకీయ అండదండలతో ఫారిన్ సర్వీసుల్లో తరిస్తోన్న టీచర్లంతా.. అక్కడ సేవలు చాలించి, మాతృశాఖకు రావాలన్న డిమాండ్ ఇప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులు, తోటి గురువుల రూపంతో తెరపైకి వస్తోంది. విద్యార్థులకు పాఠాలు చెప్పాలన్న బాధ్యతగానీ, సిలబస్ పూర్తి చేయాలన్న సంకల్పంగానీ.. తదితర మాటలేవీ వీరి ఉద్యోగ నిఘంటువులో లేవంటే అతిశయోక్తి కాదు.

**నచ్చినప్పుడు విద్యాశిక్షణ సంస్థకు**

డెప్యూటేషన్‌కు కావాల్సిన అర్హత పలుకుబడి, రాజకీయ పరిచయాలు ఉండి, టీచర్ సంఘం నేత అయితే డెప్యూటేషన్ నల్లేరు మీద నడకే. ఇదే కోవలో జిల్లాలోని విద్యాశాఖ సంస్థ నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి తిరిగి జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)కు కొందరు ఉపాధ్యాయులు నచ్చినప్పుడు మారుతున్నారు. ఈ వ్యవహారాన్ని డెప్యూటేషన్‌లో మునిగే ఉపాధ్యాయులంతా ఆర్టీసీ షటిల్ సర్వీస్ అని ముద్దుగా పిలుచుకుంటారు. డెప్యూటేషన్ మీద వెళ్లాలనుకువారికి క్రీడా పాఠశాల అయితే విడిది కేంద్రంగా మారిందన్న విమర్శలున్నాయి. ఒకవేళ వెంటనే క్రీడాపాఠశాలలో అవకాశం లేకపోతే.. ముందు టౌన్ పాఠశాల అటు నుంచి క్రీడా పాఠశాలకు వెళ్లేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక విద్యాధికారి కార్యాలయంలో, పరీక్షల బోర్డులో నలుగురైదుగురు ఉపాధ్యాయులు చాలా ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్నారు. గతంలో బదిలీలు, పదోన్నతులు, స్పాట్ తదితర అత్యవసర సమయాల్లో మాత్రమే డిప్యూటేషన్ మీద ఉద్యోగులను తీసుకునేవారు. కానీ, మూడేళ్లుగా కొందరు టీచర్లు తమ మాతృశాఖను మర్చిపోయేలా శాశ్వత ఉద్యోగులను తలపించే స్థాయిలో ఇక్కడ పాతుకుపోయారని తోటి గురువులే ఆరోపిస్తున్నారు.

**ఇష్టానుసారంగా సర్దుబాట్లు**

మరోవైపు టౌన్‌లో అధికంగా ఉన్న మిగులు పోస్టులను పక్కనబెట్టి ఇతర మండలాల నుంచి టీచర్లను ఇష్టారాజ్యంగా సర్దుబాటు చేస్తున్నారని గురువులంతా మండిపడుతున్నారు. దీని వెనక బలమైన రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. వీణవంక మండలంలో సింగిల్ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలు ఏడు ఉండగా, ఆ బడులకు సర్దుబాటు చేయకుండా అదే మండలం నుంచి ఏడుగురు టీచర్లను టౌన్‌కు కేటాయించడంలో మతలాబేంటని టీచర్లు నిలదీస్తున్నారు. 36మంది విద్యార్థులున్న పాఠశాల నుంచి ఓ టీచర్‌ను టౌన్‌కు తరలించి, ఆ స్థానంలో మరో టీచర్‌ని సర్దుబాటు చేసిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ టీచర్‌ను ధన్గర్‌వాడీ నుంచి స్వగ్రామమైన హుజూరాబాద్ పరిసరాలకు పంపి, ఆ పోస్టును టౌన్‌కే చెందిన మరో టీచరతో సర్దుబాటు చేయడంపై తీవ్ర దుమారం రేగుతోంది. కంప్యూటర్ అసిస్టెంట్, ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి మానిటరింగ్ పేరిట 10 మంది ఉపాధ్యాయులను డైట్‌కు కేటాయించారు. వారి స్థానంలో మరో పదిమందిని సర్దేశారు. కొన్ని మండల విద్యాధికారి కార్యాలయాలలో ఏళ్లుగా కొందరు సహాయకులన్న పేరుతో బోధన మరిచి పాతుకుపోయారని టీచర్లు మండిపడుతున్నారు. ఇలాంటి అక్రమ డిప్యూటేషన్లు కేవలం కరీంనగర్‌కే పరిమితం కాలేదు. మిగిలిన సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలోనూ తవ్విన కొద్దీ ఇవే చిత్రాలు వెలుగు చూస్తున్నాయి.

- జగిత్యాలలో జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ)లో ఓ టీచరు కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈయన చాక్‌పీస్ పట్టి, పాఠాలు చెప్పిన దాఖలాలు దరిదాపున లేవన్న విమర్శలున్నాయి.
- సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఓ పాఠశాల నుంచి గత ప్రభుత్వానికి సన్నిహితుడిగా ముద్రపడ్డ ఓ టీచరు స్థానికంగా డిప్యూటేషన్ మీద పనిచేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో అదే టీచరు రాజకీయ పార్టీతో బాగా అంటకాగుతున్నాడన్న ఆరోపణలపై సస్పెండ్ కూడా కావడం గమనార్హం.

# సర్పంచ్‌లకు సలాం



ఆత్మీయ సన్మానంలో ఎమ్మెల్యే కేటీఆర్, సర్పంచ్‌లు

- సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు
- సర్పంచ్‌లకు ఆత్మీయ సన్మానం

**సిరిసిల్ల:** సర్పంచ్‌లు తమ పదవీకాలంలో బాగా పనిచేశారని, సర్పంచ్‌లకు సలాం.. అంటూ సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు పేర్కొన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సర్పంచులకు సిరిసిల్ల తెలంగాణభవన్‌లో మంగళవారం ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ దేశంలోనే మన పల్లెలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. ప్రతీ ఊరిలోనూ ప్రకృతివనాలు, నర్సరీలు, క్రీడాప్రాంగణాలు, వైకుంఠధామాలు, ట్రాక్టర్లు, మల్టీపర్పస్ వర్కర్లను ఏర్పాటుచేసి పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. ఏటా అనేక అవార్డులను సిరిసిల్ల జిల్లాలోని పల్లెలు పొందాయన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో సర్పంచ్‌లు పల్లెల్లో బాగా పనిచేసి ఊర్లను తీర్చిదిద్దారని కితాబిచ్చారు. కరోనా వంటి మహామ్మారి ఆవహించినా ప్రజలను కాపాడుకున్నారన్నారు. పదవీకాలం ముగింపు దశలో ఇలా సర్పంచ్‌లను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో సిరిసిల్ల నియోజవర్గంలో చేసిన అభివృద్ధి పనులను, వేసిన రోడ్లను కేటీఆర్ వివరించారు. గ్రామానికి ప్రథమ పౌరుడైన సర్పంచ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పాలనను అందించారని వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మాట్ల మధు, బీఆర్‌ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, గజభీంకార్ రాజన్న, ఎంపీపీలు పిల్లి రేణుక, వంగ కరుణ, పడిగెల మానస, మాలోత్ భూల, జెడ్పీటీసీ సభ్యులు గుగులోత్ కళావతి, సెస్ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**సర్పంచ్‌లతో కలిసి భోజనం చేసిన కేటీఆర్**

తెలంగాణ భవన్‌లో సర్పంచ్‌లను సన్మానించిన అనంతరం వారితో కలిసి ఎమ్మెల్యే కేటీఆర్ భోజనం చేశారు. వారి కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగారు. అంతకుముందు సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నాయకుడు అగ్గి రాములు గృహప్రవేశం ఇటీవల జరగ్గా.. ఆయన ఇంటికెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు గుండ్లపల్లి రామానుజం, డాక్టర్ కుడిక్యాల రవికుమార్ అనారోగ్యంతో ఉండగా.. వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**వేములవాడరూరల్:** గ్రామంలోని సమస్యలు దశలవారీగా పరిష్కరించుకుందామని, పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అందరూ కలిసి ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం చెక్కపల్లి, నూకలమర్రి, అచ్చన్నపల్లి గ్రామాల్లో కృతజ్ఞత ర్యాలీ, సమావేశం నిర్వహించారు. చెక్కపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అచ్చన్నపల్లిలో రాష్ట్ర ఒగ్గు కళాకారుల ఆత్మీయ సమ్మేళనం అధ్యక్షుడు గాజర్ల దేవరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. ఆరు గ్యారంటీల పథకాన్ని వంద శాతం అమలు చేస్తామన్నారు. తన గెలుపునకు కృషిచేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ వేములవాడరూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ, సర్పంచ్ కరుణాకర్, లహరి, అనిల్, బండ శ్రీనివాస్, రొండి రాజు, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, శంకర్ పాల్గొన్నారు.

**మీ ఇంట్లో ఒకడిగా ఉంటా..**

**చందుర్తి(వేములవాడ):** మీ ఇంట్లో ఒకడిగా ఉంటూ.. మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం సనుగుల, దేవునితండాల్లో మంగళవారం నిర్వహించిన కృతజ్ఞతర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి రావడంతో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మొదటగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అమలు చేశామన్నారు. దేవునితండా సర్పంచ్ భూక్య పంతులునాయక్, గంగాధర రామస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**నాణ్యమైన విత్తనాలు అందిస్తాం**

**వేములవాడఅర్బన్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు వ్యాపారులు కృషిచేయాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలో కాటన్ ట్రేడర్స్, అసోసియేషన్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, వీరశైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. తూం కాంతారావు, చింతలకోటి రవి, దైత కుమార్, జనార్దన్‌రెడ్డి, చీకోటి శ్రీనివాస్, అశోక్ తదితరులు ఉన్నారు.



## వైభవంగా ఆభరణాల ఊరేగింపు



**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** మండలంలోని అల్మాస్‌పూర్‌లోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు సోమవారం వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా శబరిమలలో నిర్వహించిన విధంగానే అల్మాస్‌పూర్‌లో పూజలు చేశారు. గ్రామానికి చెందిన ఓరుగాంటి నర్సింహారెడ్డి ఇంటిలో తిరువాభరణ పూజ అనంతరం మేళతాళాలు, మాలధారుల పేటతుల్లి ఆటల మధ్య తిరువాభరణాల ఊరేగింపు కనులపండువగా సాగింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### సమావేశాన్ని జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ లక్ష్మణ్



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

**వేములవాడరూరల్:** మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ఫిబ్రవరి 4న చేపడుతున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కన్వీనర్ మీసం లక్ష్మణ్ కోరారు. వేములవాడలోని ఎంఈవో కార్యాలయం ముందు కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 21 రోజులు మధ్యాహ్న కార్మికులు సమ్మె చేసినప్పటికీ వారి సమస్య పరిష్కారం కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వారికి రూ.10 వేలు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు, నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# 'బల్మూరి'కి బంపరాఫర్

- ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెంకట్
- హుజూరాబాద్, తారుపల్లిలో సంబరాలు



బల్మూరి వెంకట్

**హుజూరాబాద్/కాల్వ శ్రీరాంపూర్:** ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం దక్కనుంది. ఈ మేరకు అధిష్టానం నుంచి కబురందగా.. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 29న ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. బల్మూరి వెంకట్ ఉమ్మడి జిల్లాకు సుపరిచితుడు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి వెంకట్ అమ్మమ్మగారి ఊరుకాగా.. 2021 ఉప ఎన్నికల్లో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. అప్పటి వరకు హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌ను పట్టించుకునేవారు లేకపోవడంతో బల్మూరి వెంకట్ అన్నీతానై నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. 2023 సాధారణ ఎన్నికల వరకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొనసాగారు. అధిష్టానం సూచన మేరకు పోటీనుంచి తప్పుకోగా, అధిష్టానం బల్మూరి సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంతో హుజూరాబాద్‌లో వెంకట్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.

**తారుపల్లిలో సంబురాలు**

బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీగా అవకాశం దక్కనుండడంతో అమ్మమ్మగారి ఊరైన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి గ్రామంలో సంబురాలు అంబరాన్ని అంటాయి. వెంకట్ తాత తారుపల్లి మాజీ సర్పంచు గోపాలకిషన్‌రావు(కాంగ్రెస్). గోపాల్‌కిషన్‌రావు పెద్దకూతురు పద్మ-మధన్‌మోహన్‌రావుల రెండో కుమారుడు వెంకట్. మధన్‌మోహన్‌రావు సివిల్ కాంట్రాక్టర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వెంకట్ తొమ్మిదో ఏటనుంచి తల్లి పద్మ అన్నీతానై డాక్టర్ చదివించింది. బల్మూరిని ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించడంతో అమ్మమ్మ ఊరైన తారుపల్లిలో సర్పంచు బైరం రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

# హిందీలో తొలి మహిళా డాక్టరేట్

- సిరిసిల్ల వాసికి గుర్తింపు
- ప్రకటించిన విద్యాశాఖ



కేటీఆర్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న చందన

**సిరిసిల్లకల్చరల్:** హిందీపై ఉన్న మమకారం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. హిందీసాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన తొలి మహిళగా సిరిసిల్లకు చెందిన పత్తిపాక చందన గుర్తింపు పొందింది. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి అయిన తండ్రి తరచూ బదిలీలు అవుతుండడంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కేంద్రీయ విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసింది. ఇలా బెంగళూర్ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థిగా ఉన్న సమయంలోనే టీచర్ ప్రేమాసింగ్ బోధన శైలికి ఆకర్షితురాలైంది. అప్పటి నుంచే ప్రేమ్‌చంద్ నవలలు, కథలు చదివి హిందీపై ఆసక్తిని పెంచుకుంది. బీఏ హిందీ ప్రధాన సబ్జెక్టుతో బీఏ డిగ్రీ పూర్తి చేసి ఉస్మానియా వర్సిటీ నుంచి స్నాతకోత్తర పట్టభద్రురాలైంది. దక్షిణ భారత హిందీ ప్రచార సభలో పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్, ఎస్ గోపి నవే ముక్తక్ అనువాద్ మూల్యాంకన్ అంశంపై ఎంఫిల్ పూర్తి చేసింది.

**హిందీ బోధకురాలిగా...**

**ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా**

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా హిందీ బోధనలో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. కథల విభాగం హిందీ బాలసాహిత్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన తొలి మహిళగా రాష్ట్రంలో గుర్తింపు పొందింది. ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టర్ శ్యామ్‌సుందర్ పర్యవేక్షణలో 'హిందీ బాల్ సాహిత్య, రాష్ట్రీయ పుస్తక న్యాస్‌కే సందర్భ్ మే' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ సాధించింది. తెలుగు నుంచి అనేక కథలను, బాలసాహిత్యాన్ని హిందీలోకి అనువాదం చేసింది. 'సచిత్ర మలేరియా' పుస్తకాన్ని నేషనల్ మలేరియా మిషన్, న్యూఢిల్లీ ప్రచురించింది. గ్రూప్ వన్ విద్యార్థుల కోసం గంగ పబ్లికేషన్స్ తెచ్చిన 'మన కవులు' పుస్తకానికి సంపాదకత్వం వహించింది.

**ప్రతి శనివారం కథాబోధన**

వారంలో ప్రతి శనివారం ఫన్‌డే పేరుతో కథలు చెబుతుంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆకాశవాణిలో చదివిన హిందీ కథలు దేశవ్యాప్తంగా ప్రసారం కావడం విశేషం. టీశాట్ కోసం చందన రూపొందించిన సుమారు 25 డిజిటల్ పాఠాలు ఇప్పటికీ ప్రసారమవుతూనే ఉన్నాయి. ఎస్‌సీఈఆర్టీ నిర్వహించిన వర్క్‌షాప్‌లు, ఇతర సదస్సుల్లో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. గజ్వేల్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో హర్యానా రాష్ట్రంతో కలసి చేసిన కార్యక్రమాలు గుర్తింపు తెచ్చాయి. తెలంగాణ, హర్యానా ఉత్సవంలో పాల్గొన్న చందన ప్రోమోను భారత విద్యాశాఖ ట్వీట్ చేసింది. ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాల్లో డిజిటల్ కంటెంట్, డిజిటల్ పాఠాల బోధనలో శ్రద్ధ చూపుతున్నారు. పిల్లల్లో మోటివేషన్‌తోపాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

# ప్రాణాపాయ స్థితిలో యువకుడు

- సాయం అందించాలని వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** నిరుపేద యువకుడు అనారోగ్యంతో బాధపడుతుండగా సాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన అనుప రాజు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న రాజును ఆస్పత్రిలో చూపించగా.. పరీక్షించిన వైద్యులు గుండె వద్ద ఇన్‌ఫెక్షన్ అయినట్లు గుర్తించారు. వెంటనే వైద్యం చేయించకుంటే ప్రాణాలకు ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఖరీదైన వైద్యం అందించి రాజు ప్రాణాలు దక్కించుకోవడానికి కుటుంబ సభ్యులు దిక్కులు చూస్తున్నారు. వైద్యం కోసం రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఇప్పటికే గ్రామస్తులు తమకు తోచిన విధంగా ఆర్థికసాయం అందిస్తున్నారు. దాతలు ముందుకొచ్చి రాజు వైద్య ఖర్చులకు సాయం అందించి, ప్రాణాలు కాపాడాలని కుటుంబ సభ్యులు అర్థిస్తున్నారు.

సాయం చేయాలనుకునే దాతలు అనుప పర్శరాములు...
**9177140956**లో ఫోన్‌పే, గూగుల్‌పే చేయాలని వేడుకుంటున్నారు.

## క్లుప్తంగా

### తెలుగు రాజ్యాధికార సమితి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ప్రవీణ్‌కుమార్



గంభీరావుపేట(సిరిసిల్ల): తెలుగు రాజ్యాధికార సమితి(టీఆర్ఎస్) తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ కూడెల్లి ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు జైభీమ్ శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్‌కుమార్ స్వస్థలం రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



తెలంగాణ భవన్‌లో భోజనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

సిరిసిల్ల: సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావును ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు మాజీ ఎమ్మెల్యేలు మంగళవారం కలిశారు. కేటీఆర్‌ను కలిసి వారు చాలా సేపు చర్చలు జరిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పారమిత విద్యార్థి



కృతికను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్‌స్పోర్ట్స్: జనగాం జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమైన 67వ రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్– 14 బాలికల పోటీలకు స్థానిక పారమిత పాఠశాలకు చెందిన కృతిక ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు వినోద్‌రావు, హనుమంతరావు, వ్యాయామ ఉపాధ్యాయులు వేణు, అర్జున్, రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

### వాహనంపై వచ్చి సెల్‌ఫోన్ చోరీ

జ్యోతినగర్(రామగుండం): వలస కార్మికుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. వివరాలిలా ఉన్నాయి.. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి మేడిపల్లి రోడ్‌లో వలస కార్మికుల షెల్టర్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు నివసిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వికాస్ తురియా షెల్టర్ ఎదుట నిలబడి బంధువులతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి సెల్ లాక్కుని పరారయ్యారు. బాధితుడు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



# బిల్లులు వచ్చేదెట్లా?



ఈ చిత్రంలో ఉన్న సర్పంచ్ పేరు నిమ్మ లక్ష్మి. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్. ఐదేళ్ల క్రితం సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగింది. ఈక్రమంలో గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు నాలుగేళ్ల క్రితం రూ.25 లక్షలు వెచ్చించింది. మన ఊరు–మన బడికి రూ.12లక్షలు, మిషన్ భగీరథకు రూ.10లక్షలు, సీసీ కెమెరాలు, మురికికాల్వలు, కమాన్ తదితరులకు మరో రూ.3లక్షల వరకు పెట్టింది. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. అప్పులు తెచ్చి పెట్టిన డబ్బులకు మిత్తీలు పెరిగిపోతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయా.. రావా.. అనే ఆందోళన చెందుతుంది. ఇది ఒక్క నిమ్మ లక్ష్మి పరిస్థితి కాదు.. జిల్లా వ్యాప్తంగా 255 గ్రామాల సర్పంచుల ఆవేదన.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో సర్పంచ్ ఇటీవల నిర్మించిన డ్రెయినేజీ. దీనికి రూ.6లక్షల వరకు ఖర్చు చేశాడు. పదవీకాలం దగ్గర పడుతున్నప్పటికీ గ్రామస్తుల సౌకర్యం కోసం ఈ డ్రెయినేజీని నిర్మించారు. పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనుండగా, బిల్లులు మంజూరుకాక అయోమయానికి గురవుతున్నారు.



నారాయణపూర్ గ్రామం

- మిగిలింది 14 రోజులే..
- ఈనెలాఖరుతో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- జిల్లావ్యాప్తంగా రూ.38.25 కోట్ల బిల్లులు పెండింగ్
- ఆందోళనలో ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామాల్లో ప్రథమపౌరులుగా గౌరవం పొందుతున్న సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక మనోవేదనకు గురవుతున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 255 గ్రామపంచాయతీలు ఉండగా.. వారి పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఆయా గ్రామాల్లో ఈ పదవీకాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సొంత డబ్బులు వెచ్చించారు. జిల్లా వ్యాప్తంగా రూ.38.25 కోట్లు వెచ్చించి పల్లెల్లో పనులు చేయగా.. గత మూడు, నాలుగేళ్లుగా డబ్బులు రాక మిత్తీలు చెల్లించకలేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి చేస్తే బిల్లులు చెల్లిస్తామన్న హామీలు ఐదేళ్లలో కూడా ఆచరణకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు.. గ్రామ పంచాయతీల మెయింటనెన్స్, సిబ్బంది జీతాలకే సరిపోతున్నాయి. వివిధ అభివృద్ధి చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులే ఆధారమవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయా.. లేవా.. అనే ఆవేదనలో సర్పంచులు ఉన్నారు.

**అధికారుల ఒత్తిడితో..**

వివిధ పథకాలలో భాగంగా గ్రామాలకు మంజూరైన అభివృద్ధి పనులు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా సర్పంచులు ముందుకొచ్చారు. గ్రామాల్లో ముఖ్యంగా డ్రెయినేజీలు, పల్లెప్రకృతివనం, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికలు, మిషన్ భగీరథ, మన ఊరు–మన బడి.. వంటి పనులను సర్పంచులు చేశారు. ఈ పనుల పరిశీలనకు వచ్చిన మండల, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో పనులు చేయాలని ఒత్తిడి చేశారు. సకాలంలో పనులు చేయకపోతే బిల్లులు రావని, నిధులు వెనక్కిపోతాయని బెదిరించడంతో అప్పులు తెచ్చి పనులు చేశారు. ఒత్తిడితో పనులు చేయించినా అధికారులు బిల్లుల మంజూరు విషయంలో చేతులు ఎత్తేశారు.

**తడిసి మోపెడవుతున్న మిత్తీలు**

చేసిన పనులకు కమీషన్ దేవుడెరుగు.. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టడంతో ప్రతీ నెల వేలకు.. వేలు మిత్తీలు కట్టలేక సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి సర్పంచ్ కొత్తపల్లి వాణి.. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు రూ.14లక్షలు అప్పులు తెచ్చి పెట్టారు. ఆ అప్పులకు ప్రతీ నెల మిత్తీలు తడిసిమెపెడవుతున్నాయి. కమీషన్‌లు వస్తాయని ఆశతో పనులు చేస్తే సకాలంలో బిల్లులు మిత్తీలు మీద పడి అప్పుల పాలవుతున్నారు.

### రూ.25లక్షల బిల్లులు రావాలే..



మా ఊరిలో వివిధ పనుల కోసం రూ.25లక్షల వరకు పెట్టుబడి పెట్టిన. గత మూడేళ్లుగా ఒక్క రూపాయి కూడా రాలేదు. రోజురోజుకు మిత్తీలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. డబ్బుల కోసం సర్పంచ్‌గా ఉండి ఆఫీస్‌ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. పనులు చేయాలని ఒత్తిడి చేసిన అధికారులు బిల్లులు ఇప్పించడంలో మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయా.. రావా.. అని ఆందోళనగా ఉంది.

– కోల అంజమ్మ, వెంకటాపూర్ సర్పంచ్

### రికార్డు ప్రకారం ఉంటే నిధులు వస్తాయి



స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ గతేడాదిగా సరిగ్గా రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో రూ.6కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. రికార్డు ప్రకారం పనులు చేసి ఉంటే తర్వాత కూడా డబ్బులు వస్తాయి. మిగతా పనులు వివిధ శాఖలతో ముడిపడి ఉంటాయి. పెండింగ్ బిల్లులు ఉన్న మాట వాస్తవమే.

– రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి

# అంతర్‌జిల్లా గజదొంగ అరెస్ట్

- 25తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని ప్రాంతంలో పలు చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా దొంగ షేక్ సలీం అలియాస్ ఉస్మాన్ అలియాస్ అస్లాం, అలియాస్ జగన్(52)ను సోమవారం అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఇతను 33ఏళ్లుగా పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్లివచ్చాడు. ఇతడిపై పీడీయాక్ట్ కూడా నమోదైంది. ఇటీవల గోదావరిఖనిలోని మార్కండేయకాలనీ, ఎల్‌బీనగర్, రమేశ్‌నగర్ ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడ్డాడు. దొంగతనాల తీరు, సాంకేతిక ఆధారాలు, ఇతర ఆధారాలతో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సంక్రాతి పండుగ సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడ్డాడు. ఈక్రమంలో స్థానిక లక్ష్మీనగర్ ప్రాంతంలో తిరుగుతుండగా చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడి నుంచి 25తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. చోరీ కేసులు చేధించడంతో కీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ క్రైం టీం ఎస్‌ఐ సమ్మయ్య, ఏఎస్‌ఐ మల్లయ్య, కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్, గోపతి వెంకటేశ్ సీఐ అభినందించారు. రివార్డు కోసం రెఫర్ చేసినట్లు వివరించారు.

## ఉరివేసుకుని వలసకూలీ బలవన్మరణం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మకాలనీలో అద్దె ఇంటిలో నివసిస్తూ పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కూలీ చంద్రహాస్(61) మంగళవారం అద్దె ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అజాంఘడ్ జిల్లా లాల్‌గంజ్‌కు చెందిన చంద్రహాస్ ఎనిమిదేళ్లుగా ఇందిరమ్మకాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తూ ఒంటరిగా జీవిస్తున్నాడు. ఇటీవల వస్త్రపరిశ్రమ బంద్ కావడంతో అనారోగ్యం పాలుకావడంతో మనస్తాపానికి గురై అద్దె ఇంటిలో కర్చీఫ్‌ల బట్టతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆత్మహత్యకు సంబంధించిన సమాచారం గ్రామస్తులు తెలిపారు. ఇంటి యజమాని కొందికొప్పుల స్వప్న ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాలోని నగదు తీసుకువెళ్లిన దొంగలు

వేములవాడఅర్బన్: వేములవాడలోని చెక్కపల్లి రోడ్డు రాజీవ్‌నగర్‌లోని పిల్లిపుష్ప ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చొరబడి బంగారు దేవత విగ్రహాలతోపాటు నగదు వెండి సామగ్రిని దొంగిలించినట్లు తెలిపారు. పిల్లి పుష్పల ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో తన కూతురు వద్దకు వెళ్లింది. ఇది గమనించిన దొంగలు ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తాళాలు పగులగొట్టి బీరువాలోని 30 గ్రాముల బంగారు దేవత విగ్రహాలతోపాటు వెండి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. స్థానికుల సమాచారంతో పుష్పల వేములవాడకు చేరుకొని ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అప్పుల బాధతో సెంట్రింగ్ కార్మికుడి ఆత్మహత్య



రాజు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు బత్తుల రాజు(34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. ఆవునూర్‌కు చెందిన బత్తుల రాజు సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సరైన ఉపాధి దొరక్క రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పురుగుల మందు తాగి, ముంబయిలోని తన సోదరికి వాట్సాప్‌లో మెస్సేజ్ పెట్టాడు. వెంటనే ఆమె ఆవునూర్‌లో ఉన్న కుటుంబీకులకు సమాచారం అందించారు. మందు ప్రభావాన్ని తట్టుకోలేని రాజు కుటుంబ సభ్యులకు ఫోన్ చేయడంతో వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. రాజు మృతితో భార్య సింధూర రోదనలు మిన్నంటాయి. మృతునికి మూడేళ్ల కుమారుడు, ఏడాదిన్నర కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఉపేందర్ తెలిపారు.

# మొబైల్ ఫోన్లు అప్పగింత



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రాఘవపేటకు చెందిన చక్రవర్తుల సంతోష్, ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్ మొబైల్ ఫోన్లు ఎక్కడో పడిపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి పోయిన ఫోన్లను గుర్తించి మంగళవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్‌కుమార్ మాట్లాడుతూ, ఎవరైనా ఫోన్లు పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా అట్టి ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. దీని ద్వారా ఫోన్‌ను మళ్లీ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరికైనా మొబైల్ ఫోన్‌లు, అనుమానిత వస్తువులు, విలువైన వస్తువులు దొరికితే సమీప పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన జంగిలి కనుకయ్య (53) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కనుకయ్య ఈనెల 10న క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారని తెలిపారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ఏ శాఖలో ఎందరున్నారు..?

- రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు కోరిన సర్కార్
- లెక్కలు తీస్తున్న జిల్లా అధికారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉద్యోగ విరమణ చేసినా.. వివిధ శాఖలు, వివిధ హోదాల్లో ఉన్నవారి వివరాలను జిల్లా అధికారులు సేకరిస్తున్నారు. రిటైర్ అయినా విధుల్లో ఉన్నవారి వివరాలను బుధవారం లోపు పంపించాలన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు కసరత్తు ప్రారంభించారు. అర్హత లేకున్నా పోస్టుల్లో కొనసాగుతున్నారని, వారిని తొలగించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వచ్చిన వినతుల మేరకు ప్రభుత్వం అలాంటి అధికారుల వివరాలను రాబట్టే పనిలో పడింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని అధికారులంతా అప్రమత్తమై జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. వివిధ శాఖలు, బోర్డులు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. కొంతకాలంగా పనిచేస్తున్న పైస్థాయి అధికారులు ఎప్పుడు ఉద్యోగంలో చేరారు..? ఎప్పుడు విరమణ విరమణ పొందారు..? కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రస్తుత శాఖలో ఎప్పటినుంచి పనిచేస్తున్నారు..? వేతనం, విద్యార్హతలు, ప్రస్తుతం పనిచేస్తున్న శాఖలో ఎప్పటివరకు కొనసాగాలని ఉత్తర్వులున్నాయో ఆరా తీస్తున్నారు.

## వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి

- నేతన్నలకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలి..
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ



రాణిరుద్రమ

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రపరిశ్రమను మూతపడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సిరిసిల్ల నియోజకవర్గం బాధ్యురాలు రాణిరుద్రమరెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే మూసివేసిన టెక్స్‌టైల్ పార్క్‌ను తెరిపించాలని కోరారు. సిరిసిల్లలో సాంచాలు బంద్‌చేసి, కార్ఖానాలు మూసివేశారని, వెంటనే ప్రభుత్వం, జౌళిశాఖ అధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ నిర్వాకంతోనే సిరిసిల్లలో ఈ పరిస్థితులు ఎదురయ్యాయని ఆరోపించారు. బతుకమ్మ చీరల బిల్లులు ప్రభుత్వం రూ.240 కోట్లు బాకీ ఉందని స్పష్టం చేశారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగానే సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని, వస్త్రపరిశ్రమ మూతపడకుండా ఆదుకోవాలని కోరారు.

## గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

- 4.03 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జగిత్యాలక్రైం: గంజాయి రవాణా చేసినా, విక్రయించినా నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ అన్నారు. గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మంగళవారం రూరల్ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. రాయికల్ మండలం భూపతిపూర్ ఎక్స్‌రోడ్ వద్ద మంగళవారం రాయికల్ ఎస్సై అజయ్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎండీ దిల్షద్, కడార్ల మహేశ్, పెద్ది జయంత్, దొనిశాల సాయి భరద్వాజ్‌లతో పాటు మరో మైనర్ బాలుడు ద్విచక్ర వాహనాలపై గంజాయి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1,00,750 విలువ గల సుమారు 4.03 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, 5 సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిందితులు ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై అజయ్, కానిస్టేబుళ్లు సాగర్, సంతోష్, ప్రశాంత్‌ను సీఐ అభినందించారు.

## కోడిపందాల స్థావరంపై దాడి



పోలీసులు అదుపులోకి తీసుకున్న పందెంకోళ్లు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని సాతారం శివారు మామిడితోటలో సోమవారం రాత్రి కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని శివారు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా బెట్టింగులతో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సాతారం శివారు పెద్దవాగు సమీపంలో గల మామిడితోటలో నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకోగా మిగతావారు పరారయ్యారు. ఆరు పందెంకోళ్లతో పాటు రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## గుండెపోటుతో బీజేపీ నాయకుడు మృతి



శంకరయ్య (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు పొనగంటి శంకరయ్య(56) సోమవారం వేకువజామున గుండెపోటుతో మృతిచెందాడు. జమ్మికుంట మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో బీజేపీ నుంచి ఉప సర్పంచ్‌గా, తర్వాత మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి పోల్సాని సుగుణాకర్ రావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చందారాజు, మాజీ ఎంపీపీ రామస్వామి, బీజేపీ సీనియర్ నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి, జూను తుల ఇంద్రారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, వివిధ పార్టీల నాయకులు మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలు..



లక్ష్మి(ఫైల్)

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని ఎల్లంపల్లిలో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందింది. ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపల్లికి చెందిన గాజుల లక్ష్మి(70) సోమవారం మధ్యాహ్నం పని నిమిత్తం వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం వ్యవసాయ క్షేత్రాల్లో వెతుకుతుండగా రాములపల్లికి చెందిన ఎర్రం మహేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద చెప్పులు కన్పించాయి. బావిలో గాలించగా మృతదేహం దొరికింది. బావి పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందిందని భర్త మొగిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా బావి పక్క నుంచి వెళ్తూ వృద్ధురాలు జారిపడితే ఆమెతోపాటు చెప్పులు కూడా బావిలో పడాలి. కానీ చెప్పులు బావి పైన ఎలా ఉంటాయని, లక్ష్మి ఉదయం నుంచి కనిపించడంలేదని ఎల్లంపల్లి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో వైరలైందని, ఆమె మృతి పట్ల గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## బావిలో పడి సెస్ ఉద్యోగి దుర్మరణం



రాజేశం మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి సెస్ ఉద్యోగి మృతిచెందాడు. కోనరావుపేట పోలీసులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన శ్రీరాముల రాజేశం(55) అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2011లో రాజేశంకు ప్రమాదం జరిగినప్పటి నుంచి మానసికస్థితి సరిగ్గా ఉండడం లేదు. రోజూలాగే ఈనెల 14న విధులకు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. 15వ తేదీ ఉదయం గ్రామానికి సమీపంలోని వ్యవసాయ బావిలో మృతిచెంది కనిపించాడు. మతిస్థిమితం సరిగ్గా లేని రాజేశం ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏఎస్సై రఘుపతిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రాజేశంకు భార్య దేవేంద్ర, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

**పురుగుల మందు తాగి వృద్ధురాలు..**

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మర్రి రాజవ్వ (70) పురుగుల మందు తాగి చికిత్సపొందుతూ మృతిచెందింది. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. రాజవ్వకు గత ఐదేళ్ల నుంచి మానసిక స్థితి సరిగా లేదు. వైద్యులకు చూపించినా నయం కాలేదు. మతిస్థిమితం కోల్పోయి ఉన్న ఆమె సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.